

# రాని బస్సు కోసం

స్వామి చిత్రానంద

మనుషులకోసం బస్సులు వస్తాయా? లేక బస్సులకోసమే మనుషులు వస్తారా? అని సందేహం కలిగింది అనంతానికి. ఎందుకంటే అతను ఆ బస్సుస్టాపులో నిలబడి అరగంటపైన అయింది. అయినా బస్సూరాలేదు, ఒక్కమనిషీ రాలేదు. ఏమీ తోచక చేతిలో వున్న తెలుగునాటకం తీసి చదువుదామనుకున్నాడు, దీపాలు వెలుగుతున్నా, బస్సుస్టాపు దగ్గర చీకటిగానే వుంది. అంచేత ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. ఇంతలో గాజుల చప్పుడు వినబడింది. ఆ చప్పుడు చేసిన ఆమె కావాలనే ఒకటికి రెండుసార్లు చేసింది. అంచేత తల ఆ పక్కకి తిప్పి, ఆ గాజుల్నీ, గాజులున్న చేతుల్నీ, ఆ చేతులుగల ఆమెనీ చూసి వెంటనే తల దించేసుకున్నాడు. కాని, ఆ గాజుల చేతులుగల ఆమె మాత్రం అతనివంక చూస్తూ, నోటిలో వున్న తమలపాకుల్ని వుమ్మేసి, ఒయ్యారంగా-

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందండీ" అంది.

"మాది ఈ వూరుకాదు" అన్నాడు ఆమె వంక చూడనైనా చూడకుండా.

"మాదీకాదు లెండి" అంది మీదే వూరు అని ధ్వనించేలా-

"మాది బెజవాడ."

"అలా చెప్పండి" అంది ఓ అడుగు ముందుకువేసి తన అంచనా సరైనదన్నట్టు

"మాది బెజవాడ ప్రోపర్ కాదు. బెజవాడ దగ్గర కంకిపాడు."

"అలాగా— అయితే, బెజవాడలోనే చూసుంటాను."

అవునో కాదో చెప్పకుండా అనంతం, అనంతంలోకి చూస్తూ వుండిపోయాడు.

"ఈ వూళ్ళో చదువుకుంటున్నారా?" అంది ఏదో బాగా తెల్సిన మనిషిలాగ.

"అవునండి బి.ఏ ఫస్టియర్లో చేరాను"

"హాస్టల్లో వుంటున్నారా?"

"హాస్టల్లో సీటు దొరకలేదు అంచేత టి. నగర్ లో ఓగది తీసుకుని వుంటున్నా."

"ఒక్కరేనా. రూంమేట్స్ ఎవరేనా వున్నారా?"

"లేరండి ఒంటరిగా వుంటేనే చదువు బాగా సాగుతుందని, మా నాన్నగారు రూంమేట్స్ వద్దన్నారు."

"అవునండి, ఒంటరిగా వుంటేనే మంచిది-బాగా సాగుతుంది-చదువు" అని అంది. కాని, ఆమె వుద్దేశంలో చదువు మాత్రం కాదన్నట్టు సాగుతుంది అన్న తర్వాత అతనివైపు చూసి తప్పనిసరై 'చదువు' అని పూర్తిచేసింది.

"మీ రూం బాగుంటుందా? లేకపోతే, మా ఇంటికి రావచ్చు." అంది ఆమె ఒళ్ళు కళ్ళు తిప్పుకుంటూ-

"లేదండి మా రూం బాగానే వుంది. మేడమీదనే కుళాయి అన్నీ వున్నాయి.

---



# దురలవాటు

పెళ్ళి చూపులు జరుగుతున్నాయి. అమ్మాయి, అబ్బాయి చూసుకోడం పూర్తయింది. పెళ్ళికూతురు తండ్రి, పెళ్ళికొడుకు తండ్రిని రహస్యంగా పక్కకి లాక్కెళ్ళి—

"మీ అబ్బాయికి సిగరెట్ అలవాటుందా?" అని ప్రశ్నించాడు.

"లేదు"

"పేకాడడు కదా?"

"ఎబ్బే"

"మనలో మాట తాగుడూ ?"

"ఛ ఛ ఆ వాసనే వాడికి గిట్టదు.

"చెడు సావాసాలున్నాయా?"

"లేవు"

"గుర్రపు రేసులు ?"

"ఎబ్బెబ్బెబ్బే!"

"తర్వాత " అని ఇంకా ఏదో ప్రశ్నించేలోగా. పెళ్ళికొడుకు తండ్రి— "దురలవాటన్నదేమీ మావాడికి లేదు ఎప్పుడేనా సరదాకి బెల్ బాటమ్ పాంట్లొస్తున్నాయిచూసారూ అవి కడతాడంతే! అదొక్కటే" అన్నాడు విసుగ్గా.

—ముద్దా రమేష్



ఇంతకీ మీరు?" అని ఆగిపోయాడు, ఏం అడగాలో ఎలా అడగాలో తెలియక.

ఎవరు ఏమి అడక్కపోయినా చెప్పడం- ఎవరు ఏమీ చెప్పకపోయినా అడగడం అలవాటైన ఆమె వెంటనే మొదలెట్టింది.

"నాపేరు సుశీల నాకు వెనకా ముందూ ఎవరూ లేరండి. నా మీద ఆధారపడిన తల్లి, ముగ్గురు చెల్లెళ్ళు వున్నారండి. వాళ్ళందరినీ, నేనే పోషించాలండీ." అంది ఎంతో బాధగా సానుభూతి చూపరా అని ప్రాధేయపడుతున్నట్టు.

"పిత్రార్జితం ఏమీ లేదాండీ?" అన్నాడు అనంతం కూడా సానుభూతితోనే.

"పిత్రార్జితం లేదు. మాత్రార్జితంలేదు అంతా స్వార్జితమే."

"అయ్యో! పాపం" అన్నాడు మిగిలిన సానుభూతి అంతా ఒలకపోస్తూ.

"మీరు టి. నగర్ వెళ్తున్నారా?" అని అడిగింది సుశీల.

"అవునండి మీరు?" అన్నాడు అనంతం.

"నేనూ టి. నగరే" అంది సుశీల అతనికి తోడు వుంటాను అన్నట్టు

"బస్సు ఎప్పటికీ రాదేమండి? మా వూళ్ళో అయితే, సైకిల్ రిక్షాలు దొరుకుతాయి. ఇక్కడ అవి కూడా కనబడ్డం లేదు."

"అవునండి. టాక్సీ వచ్చినా బాగుండును. ఇద్దరం కల్సివెళ్ళిపోవచ్చు" అంది, 'కల్సి' అన్న రెండక్షరాలూ నొక్కి-

నొక్కి.

"టాక్సీవాళ్ళు సందులూ గొందులూ తిప్పి తీసుకెళ్తారట కదండీ అందుకే మా నాన్న టాక్సీలు ఎక్కొద్దని మరీ మరీ చెప్పి వెళ్లాడు" అన్నాడు.

"ఆ పప్పులేం మనదగ్గర వుడకవ్. ఈ 'వూరంతా మనకి బాగా తెల్సు." అంది సుశీల.

ఇంతలో ఒకాయన గబగబా పరుగెత్తుకువచ్చి, సుశీలను ఓసారి ఎగాదిగా చూసి —

"ఏమండీ! ఇక్కడ మీ రెంత సేపట్నించి వున్నారండీ? మైలాపూర్ బస్ వెళ్ళిపోయిందా?" అని అడిగాడు.

"లేదండి-నేనూ దానికోసమే చూస్తున్నాను" అంది సుశీల అనంతం సమాధానం చెప్పేలోగా. ఆ మాటలు విన్న ఆయన ఆమెను ఓసారి పరీక్షగా చూశాడు. ఆమె కూడా 'ఇంకా చూడండి' అన్నట్టు అతన్ని చూసింది.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుందండీ" అన్నాడు అతను.

"అలాగాండీ?" అంది ఆమె.

"మాది రాజమండ్రి" అన్నాడు అతను.

"మాదీ రాజమండ్రీయే" అంది ఆమె.

"ఎక్కడికి వెళ్తున్నారు మీరు" అన్నాడు అతను.

"మైలాపూర్ మీరు ఒస్తారా?" అంది ఆమె.

"ఓ తప్పకుండా" అన్నాడతను.

వీళ్ళ సంభాషణలు అనంతానికి అర్థం కాలేదు. ఈమెది బెడవాడో, రాజమండ్రీయా? ఈమె వెళ్ళేది టి. నగరా? మైలాపూరా? అని సందేహించుకుంటూ వుండగా, ఓ టాక్సీ ఆమెని చూసుకుంటూ వచ్చి ఆగింది. అతనే టాక్సీ తలుపు తీసి, ఆమెను ఎక్కమని సంజ్ఞచేశాడు. ఆమె ఎక్కబోతూ ఒక్కసారి అనంతాన్ని చూపింది జాలిగా. వెంటనే 'అతని'కేసి చిరునవ్వు విసిరి, ఎక్కి కూచుంది. అతనూ ఎక్కి తలుపు మూశాడు

"తిన్నగా అడయార్ పో" అంది ఆమె డ్రయివర్ని ఆజ్ఞాపిస్తూ—

అనంతానికి ఇదేమీ అర్థంకాలేదు కాని ఒక్కటి మాత్రం అర్థమైంది మనుషుల కోసం మనుషులే వస్తారు బస్సులు రావూ అని.

"మీరే బస్సుకోసం?" అంటూ మరో గాజుల చేతుల ఆమె చేతులు చప్పుడు చేయకుండా వచ్చి అడిగింది.

"రాని బస్సుకోసం" అని నడిచి వెళ్ళిపోయాడు.

